క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కుత్బుల్లాపూర్: ఈటల ఫర్ మల్కాజ్‌గిరి క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం మేడ్చల్ జిల్లా బీజేపీ అర్బన్ కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి ప్రారంభించారు. జీడిమెట్ల గ్రామంలో వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఈటల రాజేందర్‌కు వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అధిష్టానం మల్కాజ్‌గిరి పార్లమెంటరీ స్థానాన్ని కేటాయించే అవకాశముందన్నారు. ఈ నేపథ్యంలో ఆయన గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజిరెడ్డి, వైభవన్, జనార్దన్ రెడ్డి, సతీష్‌సాగర్, అర్వింద్, యవ్వంత్, సతీష్, చక్రీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టెక్నికల్ ఫెస్ట్ వలారస్ 2కే24

దుండిగల్: దుండిగల్ ఎంఎల్‌ఆర్‌టీఎం, ఫార్మసీ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన నేషనల్ లెవెల్ టెక్నికల్ ఫెస్ట్ వలారస్ 2కే24 శనివారం ఘనంగా ముగిసింది. వివిధ కళాశాలలకు చెందిన నాలుగు వేల మంది విద్యార్థులు ఈ టెక్ ఫెస్ట్‌లో రొబోటిక్స్ కోడింగ్, డీబగ్గింగ్, బిల్డింగ్ ఆర్కిటెక్చర్, బీజిజెన్–ఈ సమ్మిట్, వెల్డింగ్, బ్యాటరీ వెహికల్స్, షుగర్‌టెస్ట్, ఐచెకప్ తదితర విభాగాల్లో పాల్గొని తమ నమూనాలను ప్రదర్శించారు. ఉత్తమ నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరరెడ్డిలు మాట్లాడారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణ చేపట్టడానికి ఈ ఫెస్ట్ దోహద పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రొబోటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు కిషన్, కళాశాల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ మర్రి అనుశ్రేయరెడ్డి, ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ అర్జబ్ మాలిక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్నా చెరువులో గుర్రపుడెక్క తొలగింపు

కుత్బుల్లాపూర్: వెన్నెలగడ్డ ఎన్నా చెరువులో జరుగుతున్న గుర్రపుడెక్క తొలగింపు పనులను శనివారం గ్రేటర్ ఎంటమాలజిస్ట్ డా. రాంబాబు పరిశీలించారు. ఎంటమాలజీ అధికారి ఉమారాణి పర్యవేక్షణలో నాలుగు రోజులుగా ఇక్కడ గుర్రపుడెక్క ఎఫ్‌టీసీ పరికరం ద్వారా తొలగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు వచ్చి పరిశీలన చేసి వెళ్తున్నారు. మరో నెల రోజులు ఈ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు.

విద్యార్థులకు ఎగ్జామ్ కిట్ల పంపిణీ

చింతల్: హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో చింతల్ డివిజన్ నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో గురువారం 20 మంది సింగిల్ పేరెంట్స్ విద్యార్థులకు ఎగ్జామ్ కిట్స్ అందజేశారు. సొసైటీ వ్యవస్థాపకుడు విజయ్‌కుమార్ దాతలు వీరందర్ సింగ్ రాథోర్ సహకారంతో విద్యార్థులకు ఎగ్జామ్ పాడ్స్, స్టేషనరీలతో కూడిన కిట్లను అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యుడు సయ్యద్‌సాజిత్, పాఠశాల ఇన్‌చార్జ్ జగదీష్, ఉపాధ్యాయులు రాజామణి, నాగమణి, యద్బాయ్, పద్మప్రియ, జ్యోతి తదితరులు ఉన్నారు.

రోడ్డు విస్తరణ సర్వే షురూ

సుభాష్‌నగర్: నిత్యం వాహనాల రద్దీతో తిరుకావున గాజులరామారం చౌరస్తాను విస్తరణ చేయడానికి అధికారులు కసరత్తు ప్రారంభించారు. షాపూర్ నగర్, కూకట్‌పల్లి, మియాపూర్ రోడ్లను కలిపే ఈ చౌరస్తా గుండా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో చౌరస్తా ఉండడంతో వాన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ విషయమై గతంలో 'సాక్షి'పలుమార్లు పెళ్లిలోకి తీసుకురాగా అధికారులు పరిశీలించారు. ఎట్టకేలకు చౌరస్తాను విస్తరణ చేయడానికి సర్వే పనులు ప్రారంభించారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

నిజాంపేట్: నిజాంపేట్‌లోని రవీంద్రభారతి స్కూల్‌లో శనివారం వైజ్ఞానిక ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ అకాడమిక్ ఆఫీసర్ డాక్టర్ రవికుమార్, వీఎన్‌ఆర్ విజేఐఇటీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్‌కుమార్, రవీంద్రభారతి విద్యా సంస్థల కేపీహెచ్‌బీ జోన్ డీన్ శ్రీలత ముఖ్యఅతిథులుగా హాజరై వైజ్ఞానిక ప్రదర్శను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన చంద్రయాన్–2 నమూనా, ఇతర సైన్స్ నమూనాలు ఆకట్టుకున్నాయి. వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకను వెలికి తీయడానికి దోహదపడతాయని వక్తలు పేర్కొన్నారు.

అధికలోడు వాహనాలను నివారిస్తాం

మేడ్చల్ జిల్లా రవాణాశాఖ అధికారి రఘునందన్‌గౌడ్



కుత్బుల్లాపూర్: రోడ్డు భద్రత విషయంలో ఎప్పటికప్పుడు చర్యలు చేపడతామని.. అధికలోడు వాహనాలను నివారిస్తూ ముందుకు సాగుతామని మేడ్చల్ జిల్లా రవాణా అధికారి రఘునందన్‌గౌడ్ అన్నారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన శనివారం పేట్‌బషీరాబాద్‌లోని మేడ్చల్ జిల్లా రవాణా కార్యాలయంలో రవాణా శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేసి కార్యాలయాలకు వచ్చే వారిని గుర్తించి వెంటనే వారికి సంబంధించిన పనులను చేసి పంపించాలన్నారు. ఎవరిని ఎక్కువ సేపు కార్యాలయంలో ఉండే విధంగా వ్యవహరించరాదని, పౌర సేవలను పారదర్శకంగా అందించాలని కోరారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు చేపట్టి అనుమతులు లేని వాహనాలను, అధిక లోడుతో వెళ్లే వాటిని తనిఖీల్లో పట్టుబడితే వాహనాలను సీట్ చేయడంతో పాటు డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేయనున్నట్లు హెచ్చరించారు. అంతకుముందు రఘునందన్ గౌడ్ ఆర్టీఏ సేవల కోసం వచ్చిన వారితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు వాహనాల రిజిస్ట్రేషన్‌లో ప్రక్రియను పరిశీలించారు. ప్రతిరోజు వచ్చే వారికి సీరియల్ నెంబర్లను కేటాయించి త్వరితగతిన వారి పనులను పూర్తి చేసి పంపించాలని అధికారులను ఆదేశించారు.

చెత్త వేయొద్దని.. మొక్కలు నాటి

సుభాష్‌నగర్: జనవాసాల మధ్య, ఆపై పాఠశాల ముందు నిత్యం చెత్త వేయడం, పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను తొలగించి శుభ్రం చేయడం కొంతకాలంగా ఇదే విధంగా నడుస్తోంది. ఇక్కడ చెత్త వేయరాదని శుభ్రం చేసి ముగ్గులు వేసిన ఎవరు చెవిన పెట్టలేదు. ప్రతినిత్యం సీన్ అదే విధంగా కొనసాగింది. దీంతో విసిగివేసారి పోయిన సిబ్బంది చెత్తకు చెక్కు పెట్టేందుకు చెట్లు నాటే కార్యక్రమం చేపట్టారు. జీడిమెట్ల డివిజన్ అంగడిపేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ముందు ఇక చెత్త వేయకుండా శానిటేషన్ సూపర్‌వైజర్ జార్జ్ ఆధ్వర్యంలో సిబ్బంది వీరేష్, లావణ్య, వందన, ప్రమీల, ఎల్లయ్య లు చెత్తను తొలగించి ఆ స్థానంలో మొక్కలు నాటి ముగ్గులు వేశారు. ఇక నుంచి ఇక్కడ చెత్త వేయవద్దని స్థానికులకు తెలియజేశారు.




పాఠశాల ఎదుట చెత్త వేయకుండా చెట్లను నాటిని పారిశుద్ధ్య సిబ్బంది

వసతులు బ్రహ్మాండం

మహాశివరాత్రి ఉత్సవాలకు కీసరగుట్ట ముస్తాబు

మార్చి 6వ తేదీ నుంచి 11 వరకు జాతర



కీసరగుట్ట ఆలయ పరిసరాలు



క్యూలైన్లు ఏర్పాటు చేసిన దృశ్యం

కీసర: వచ్చే నెల 6వ తేదీ నుంచి 11 వరకు జరుగనున్న కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. గుట్టకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈసారి జాతరకు లక్షల మంది భక్తులు వస్తారన్న అంచనాతో అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే కలెక్టర్ గౌతమ్ ఒకసారి జిల్లా యంత్రాంగంతో సమీక్ష సమావేశం నిర్వహించడంతో పాటు ఈ నెలాఖరులోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈక్రమంలో మరోసారి కలెక్టర్ గౌతమ్ ఆధ్వర్యంలో జాతర ఏర్పాట్లకు సంబంధించి రెండోసారి సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ నాగలింగం తెలిపారు. మార్చి 1వ తేదీ నుంచి లడ్డూ ప్రసాదం తయారీ చేపట్టనున్నారు.

పనులు పరిశీలించిన ఆర్డీఓ

కీసర: బ్రహ్మోత్సవాల సందర్భంగా కీసరగుట్టకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేయాలని కీసర ఆర్డీఓ వెంకట ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఇక్కడ జరుగుతున్న పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్, వాహనాల పార్కింగ్, రోడ్డు విస్తరణ పనులపై పలు సూచనలు చేశారు. సామాన్య భక్తులతో పాటు వీఐపీ దర్శనాలకు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ఆయన వెంట కుషాయిగూడ ఏసీపీ నరేశ్‌రెడ్డి, కీసర సీఐ వెంకటయ్య, ఆలయ చైర్మన్ నాగలింగం, ఈఓ నరేందర్, ట్రస్టు బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు కలుగకుండా..



సామాన్య భక్తులకు దర్శనంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏరాట్లు చేస్తున్నాం. గర్భాలయంలో కొలువైన స్వామివారిని ఒకేసారి నలుగురు దర్శించుకునేలా క్యూలైన్ల నిర్మిస్తున్నాం. వీవీఐపీలకు ప్రత్యేక క్యూలైన్ ఉంటుంది. శీఘ్ర దర్శనం, అభిషేకం టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతాం. ఈసారి ప్రసాదాల కొరత రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

– తటాకం నాగలింగం, ఆలయ చైర్మన్



ప్రధాన ఆలయానికి పంచ రంగులు వేస్తున్న దృశ్యం



కీసరగుట్ట జారత జరిగే ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ట్రాక్టర్‌తో చదును చేస్తున్న దృశ్యం

పనులు ఇలా..

1. గుట్ట పరిసర ప్రాంతాలతో పాటు ప్రధాన ఆలయం, రాజగోపురాలు, ఆంజనేయ స్వామి విగ్రహానికి, మహామండపానికి రంగులు వేసే కార్యక్రమం.
2. మరోవైపు హుడా పార్కు నుంచి ఉత్తర ద్వారం గుండా స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్లు, భక్తులు సేద తీరేందుకు ఆంజనేయ స్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో చలువ పందిళ్ల నిర్మాణం.
3. కమాన్ నుంచి గుట్ట వరకు ఆర్ అండ్ బీ రహదారి విస్తరణ పనులు.
4. విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా చెట్ల కొమ్మల తొలగింపు తదితర పనులు
5. కీసరగుట్ట దేవస్థానం చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ నరేందర్‌ల ఆధ్వర్యంలో కీసర నుంచి గుట్ట ప్రధాన ఆలయం వరకు సైన్‌బోర్డుల ఏర్పాటు. 6. ఆర్‌డబ్ల్యూఎస్, ఎగ్జిబిషన్ గ్రౌండ్ చదునుతో పాటు మరుగుదొడ్ల ఏర్పాటు, పార్కింగ్ ప్రాంతాల ఏర్పాటు.

మెరుగైన వసతులను కల్పించే దిశగా పనిచేయాలి



సమావేశంలో అధికారులకు సూచనలు ఇస్తున్న కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్

కుత్బుల్లాపూర్: ప్రజలకు మెరుగైన వసతులను కల్పించే దిశగా అధికారులు పని చేయాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ అన్నారు. శనివారం కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల అధికారులతో కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్థానికంగా చేపడుతున్న అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన పనులపై ఆరా తీశారు. జంట సర్కిళ్ల పరిధిలోని పార్కుల సర్వే నిర్వహించి ప్రజలకు అవసరమైన తాగునీరు, బెంచీలు, లైటింగ్, పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు.

◆ అదే విధంగా పార్కుల అంతటా దీప కాంతులు ఉండేలా చూడాలని, అసాంఘిక కార్యక్రమాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జంట సర్కిళ్ల పరిధిలో విద్యుత్ దీపాలు సక్రమంగా వెలిగేలా చూడాలన్నారు. ఏదైనా ఫిర్యాదు అందిన వెంటనే 24 గంటల్లోపు పరిష్కరించాలని సూచించారు.

◆ పారిశుద్ధ్యం విషయంలో అశ్రద్ధ చూపరాదని, సిబ్బంది వారికి కేటాయించిన ఏరియాలకు ఉదయం 6 గంటల వరకు చేరుకుని విధులు నిర్వర్తించాలన్నారు. ఏఎంహెచ్ఓ పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు.

◆ రంజాన్ మాసం ప్రారంభవుతున్న నేపథ్యంలో గ్రేవ్‌యార్డుల వద్ద స్పెషల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఫుట్ పాత్ అక్రమణలు, అనుమతి లేని నిర్మాణల విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు. భవన నిర్మాణదారులు అనుమతులు తప్పక పొందాలన్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డంపింగ్‌కు పాల్పడే వాహనాలను సీజ్ చేసి సదరు వాహనదారులపై కేసులు నమోదు చేయాలన్నారు.

◆ అదే విధంగా భవన సెల్లార్‌లో వాణిజ్య కార్యకలాపాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు అక్రమంగా నిర్మించిన అదనపు అంతస్తు భవనాలను గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా నివాసిత పర్మిషన్ తీసుకుని కమర్షియల్‌గా వినియోగిస్తున్న భవన యజమానులకు భారీ చలాన్‌లు విధించాలని ఆదేశించారు. ఈ సమావేశంల కుత్బుల్లాపూర్, గాజులరామారం ఉప కమిషనర్లు నరసింహ, మల్లయ్యలతో పాటు ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, విద్యుత్, శానిటేషన్ తదితర విభాగాలు పాల్గొన్నారు.

విక్టోరియా యూనివర్సిటీతో సెయింట్ మార్టిన్స్ ఎంఓయూ



ఎంఓయూ కార్యక్రమంలో పాల్గొన్న సెయింట్ మార్టిన్స్ కళాశాల యాజమాన్యం, విక్టోరియా యూనిర్సిటీ ప్రతినిధులు

సుభాష్‌నగర్: దూలపల్లిలోని సెయింట్ మార్టిన్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆస్ట్రేలియాకు చెందిన విక్టోరియా యూనివర్సిటీతో ఎంఓయూ కుదుర్చుకుంది. శనివారం కళాశాల ఆవరణలో జరిగిన ఒప్పందంలో కళాశాల డైరెక్టర్ సంతోష్‌కుమార్ పాత్రా యూనివర్సిటీ గ్లోబల్ హెడ్ డాక్టర్ ఆండ్రూతో ఒప్పందం పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ పాత్రా మాట్లాడుతూ... ఈ ఒప్పందంతో తమ విద్యార్థులు, అధ్యాపకులకు ఎంతో ఉపయోగపడనుందన్నారు. సంయుక్త పరిశోధనల ద్వారా నూతన టెక్నాలజీ ఆవిష్కరణలకు దోహద పడుతుందన్నారు. అంతే కాకుండా తమ విద్యార్థులు ఉన్నత చదువులకు నేరుగా వెళ్లేందుకు ఆస్కారం కలుగనుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌యాదవ్, డైరెక్టర్ జైకిషన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో ఉంచిన నమూనాలను తిలకిస్తున్న తల్లిదండ్రులు

నియామకం

సుభాష్‌నగర్: దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లి చెందిన దాసరి శ్యామ్‌రావును బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా వైస్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జీ. కళ్యాణ్‌నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆకట్టుకున్న నమూనాలు

జీడిమెట్ల: విద్యార్థులు పాఠ్యాంశాలలోని నమూనాలను తయారు చేసి వివరించడం వలన మేధాశక్తి పెరుగుతుందని టీవీఆర్ మోడల్ స్కూల్ అకాడమిక్ డైరెక్టర్ టి.వంశీకృష్ణారెడ్డి అన్నారు. శనివారం పాఠశాలలో టీచర్స్ అండ్ పెరేంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 2వ తరగతి విద్యార్థులు తయారు చేసిన పలు ప్రాజెక్టుల నమూనాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను డైరెక్టర్ వంశీరెడ్డి ప్రారంభించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. చిన్నారులకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తగిన ప్రోత్సాహాన్ని అందిస్తే వారు భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదుగుతారన్నారు. ప్రదర్శనలో భాగంగా పూర్వం వాడుకలో ఉన్న పనిముట్లు, బోరింగ్ పంప్, నీటిబావులు, మోటబావులు, ఇండియా గేట్, చార్మినార్, తాజ్‌మహల్, కుతుబ్‌మినార్, రామ మందిరం, వివిధ నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మణ్, రజిని తదితరులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి పడి కార్మికుడు మృతి



మృతుడు రమేష్

దుండిగల్: నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడి ఓ కార్మికుడు మృతి చెందిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... ఒడిస్సా రాష్ట్రానికి చెందిన రమేష్(50) నగరానికి వలస వచ్చి భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో బహదూర్‌పల్లి గ్రీన్‌ఫీల్డ్ కాలనీలోని నిర్మాణంలో ఉన్న ఓ భవన నాలగువ అంతస్తులో పనిచేస్తున్న రమేష్ ప్రమాదవశాత్తు కిందకు జారి పడ్డాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయాలు కావడంతో సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. 15రోజుల క్రితమే రమేష్ కుటుంబం జీవనోపాధి నిమిత్తం నగరానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా అధికారులు సిద్ధంగా ఉండాలి



అధికారులతో సమావేశమైన ఎన్నికల రిటర్నింగ్ అధికారి సైదులు

కుత్బుల్లాపూర్: లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడొచ్చినా అధికారులు సిద్ధంగా ఉండాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో బీఎల్ఓలు, అధికారులతో సైదులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విధుల్లో పాల్గొన్న బీఎల్ఓలు అదే మాదిరిగా లోక్‌సభ ఎన్నికల్లో సైతం పని చేయాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన వెంటనే బూత్‌ల వారీగా ఓటర్ రిసీట్‌లను పంపిణీ చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఉప కమిషనర్లు మల్లయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం





స్వామి వారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



ఆలయ వ్యవస్థాపకుడు కూన వెంకటేశ్‌గౌడ్‌ను సత్కరిస్తున్న కాలనీవాసులు

కుత్బుల్లాపూర్: గాజులరామారం వీనస్ ఎన్‌క్లేవ్‌లోని శ్రీ వరసిద్ధి వినాయక ఆలయంలో శనివారం పాంచానిక దీక్ష మహోత్సవంలో భాగంగా ఐదో రోజు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ విజయ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ఈ కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు చుట్టు పక్కల కాలనీలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ పూజల్లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, ఆలయ వ్యవస్థాపకులు కూన వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రవణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కాలనీవాసులు గుంటుపల్లి శ్రీనివాసరావు, గుడివాడ సురేష్‌కుమార్, గుర్రం నరసింహారావు, వివేక్ వర్ధన్, పవన్‌కుమార్ గుప్తా, ప్రతాపరెడ్డి, వినయ్‌కుమార్, నవీన్‌కుమార్, కృష్ణ, కిషోర్, శంకర్ బాబు, నవీన్‌లు తదితరులు పాల్గొన్నారు.



సమాజ సేవలో విద్యార్థులు



దూలపల్లిలో మహిళా సాధికారితపై అవగాహన కల్పిస్తున్న కళాశాల విద్యార్థులు

కుత్బుల్లాపూర్: కొంపల్లికి చెందిన శివ శివానీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాలకు చెందిన పీజీడీఎం విద్యార్థులు సమాజ సేవలో నిమగ్నమయ్యారు. విద్యార్థులు తరగతి గదికే పరిమితం అవ్వకుండా సమాజంలో చైతన్యం కల్పించాలని పూనుకున్నారు. శనివారం కొంపల్లి, బౌరంపేట్, దూలపల్లి, దుండిగల్ గ్రామాలకు వెళ్లి అక్కడి పాఠశాల విద్యార్థులకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా చిరు వ్యాపారులకు, ప్రజలకు డిజిటల్ అక్షరాస్యత గురించి వివరించారు. విద్యార్థులు బృందాలుగా విడిపోయి వివిధ కార్యక్రమాలకు అంకురార్పణ చేశారు. బాల పోషణ, స్కాలర్‌షిప్‌లు, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్యం, ఆరోగ్య సంరక్షణ వంటి అంశాలపై విద్యార్థులకు, వారి తలిదండ్రులకు అవగాహన కల్పించారు. సేవా కార్యక్రమాలు, సామాజిక చైతన్య కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులను శివశివానీ విద్యా సంస్థల చైర్మన్ ఆర్తి సంపతి, వైస్ ప్రెసిడెంట్ శైలేష్ సంపతిలు అభినందించారు.